


# కరపత్రం

SINCE 2014

బుధవారం అక్టోబర్ 09 2024 | సంపుటి :0 | సంచిక : 2 | పేజీలు:4 | వెల-5


# హుస్సేన్ సాగర్..

## మూసీ పాపాలకు కాంగ్రెస్ కారణం కాదా?




- 'చెరువుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చకు సిద్ధమా?' అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు.

హైదరాబాద్: 'చెరువుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చకు సిద్ధమా?' అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. గూగుల్ మ్యాప్స్ ఫీచర్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి చెరువుల పరిస్థితి ఎలా ఉందో చూద్దామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "భట్టి విక్రమార్క ప్రకటించిన జాబితా ప్రకారం ప్రభుత్వానికి అక్రమ నిర్మాణాలను కూల్చే దమ్ముందా? కూల్చివేతలతో ఇప్పటికే రూ.వెయ్యి కోట్లకు పైగా ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లింది. రూ.వందల కోట్లు కొల్లగొట్టి కడుపులు నింపుకోవాలనేది ప్రభుత్వం ఆలోచన. హుస్సేన్ సాగర్, మూసీ పాపాలకు కాంగ్రెస్ పార్టీ కారణం కాదా?" అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు.

## నాంపల్లి కోర్టులో నాగార్జున వాంగ్మూలం
## మంత్రి సురేఖపై చర్య తీసుకోవాలని వినతి

హైదరాబాద్,అక్టోబర్ 8



తన కుటుంబంతో పాటు, కుమారుడు నాగచైతన్య-సమంత విడాకుల వ్యవహారంపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారని సినీ నటుడు నాగార్జున నాంపల్లి కోర్టుకు తెలిపారు. రాజకీయ విమర్శల్లో భాగంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ నాగార్జున, నాగచైతన్య, సమంతల పేర్లను ప్రస్తావించారు. ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో నాగార్జున మంత్రిపై నాంపల్లి కోర్టులో క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. పేజి 2లో

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని జీతాలు



ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్‌కు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కనిపించడం లేదా.. అని నిలదీశారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. దండగమారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారు నెలలుగా జీతాల్లేవ్ అని తెలిపారు. పంచాయతీ వర్కర్స్, మున్సిపాలిటీ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది, హాస్టల్ వర్కర్స్, గెస్ట్ లెక్చరర్స్.. ఇలా ప్రతీ శాఖలో వేతనాల్లేక చిరుద్యోగులు విలవిలలాడిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పేజి 2లో

## విద్యుత్ శాఖలో ఉద్యోగాలకు త్వరలో భారీ నోటిఫికేషన్: భట్టి

**విద్యుత్ శాఖలో ఉద్యోగాల భర్తీకి త్వరలోనే భారీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.**



హైదరాబాద్: విద్యుత్ శాఖలో ఉద్యోగాల భర్తీకి త్వరలోనే భారీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామన్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "పదేళ్లుగా నిలిచిన పదోన్నతులను ఇప్పటికే పూర్తి చేశాం. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజలు 1912 నంబర్‌కు కాల్ చేయండి" అని సూచించారు.

"ఇటీవల వరదలకు నష్టపోయిన ప్రజలను ఆదుకొనే చర్యలు చేపట్టాం. వరదల సమయంలో శ్రమించిన విద్యుత్ సిబ్బందికి అభినందనలు. ఫీజు రీయంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేస్తాం. దసరా కంటే ముందుగానే పెండింగ్ బకాయిలు విడుదల చేస్తాం" అని తెలిపారు.

## ఈడీ విచారణకు హాజరైన మాజీ ఎంపీ అజహరుద్దీన్



హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హెచ్‌సీఏలో జరిగిన అవకతవకల వ్యవహారంలో ఇటీవల ఈడీ ఆయనకు నోటీసులు జారీ చేసింది. 2 లో


## సుప్రీం తీర్పుకు విరుద్ధంగా నియామకాలు




ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండా డిఎస్సీసిఎం రేవంత్ రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదు

నేడు రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలకు మందకృష్ణ పిలుపు 2 లో

# ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులలో వివక్ష





ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలకు అన్యాయం
జీతాలు ఇవ్వలేక యాజమాన్యాలు ఆందోళన
ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా, సుమారు 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం అగమ్యగోచరంగా మార్చింది అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల జరుగుతున్న ఇబ్బందులను హరీశ్‌రావుకు తెలంగాణ ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజేస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం మూలంగా.. టీసీ, ఇతర సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వడం లేదు. దీని వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. దీనివల్ల విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని హరీశ్‌రావు మండిపడ్డారు.విద్యా వ్యవస్థ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి ఇంతకు మించిన ఉదాహరణ లేదు. పేజి 2లో

## తెలంగాణలో బలపడడమే లక్ష్యం

### రేవంత్‌పై విమర్శలకు బిజెపి పదును

తెలంగాణలో బిజెపి తన బలాన్ని మరింత పెంచుకునే పనిలో పడింది. అదేపనిగా అధికార కాంగ్రెస్‌ను విమర్శలుచేసే ప్రయత్నాలకు పదును పెడుతోంది. ప్రధాని మోడీ సహా నేతలంతా కాంగ్రెస్‌పై పడ్డారు. కేంద్రంలో తామిచ్చిన హామీలను అమలు చేయలేని వారు తెలంగాణలో మాత్రం అమలు చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. తమకో నీతి...తెలంగాణకో నీతి అన్న చందంగా బిజెపి నేతల తీరు ఉంది. తెలంగాణలో బలంగా ఉన్న కాంగ్రెస్‌ను వెంటనే ఆగం చేయాలన్న ఆతురత కనిపిస్తోంది. పది నెలలకే తెలంగాణ ఆగమయ్యిందన్న భావనలో బిజెపి ఉంది. పదేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసి అలసిపోయారు. ఒక్కటంలే ఒక్క అవినీతిచర్యలపై చర్య తీసుకోలేదు. బిజెపి సెల్ఫ్‌గోల్ కారణంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు పరిస్థితులు సహకరించాయి. అయినా వారు రాజకీయ పరిస్థితులను గుర్తించడం లేదు. కోటి ఉద్యోగాల హామీని బిజెపి ఎప్పుడో మరిచి పోయింది. విభజన హామీలను తుంగలో తొక్కింది. ఇవన్నీ ఎవరు ప్రశ్నించాలి. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఏ విధంగా సాయం వచ్చే ఆలోచించరు. ఎలా నిధులు తీసుకుని రావచ్చో పట్టించుకోరు. విలీన మండలాలపై మాట్లాడరు. ఉమ్మడి రాష్ట్రం నుంచి విడివడ్డ ఆంధ్రప్రదేశ్‌లో మిత్రపక్షాలతో కలిసి బిజెపి అధికారంలోకి వచ్చింది. అక్కడ కేవలం టిడిపి, జనసేన కారణంగా బిజెపి కొంత నిలదొక్కుకో గలిగింది. జగన్ పాలన కూడా ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. అరచాక పాలనతో విసిగి పోయిన ప్రజలు ఈ కూటమికి పట్టం కట్టారు. ఇందులో బిజెపి చేసిన ప్రయత్నం ఏమీ లేదు. ఇదంతా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఉమ్మడి కృషిగానే గుర్తించాలి. అయితే ఇదంతా తమ ఘనతగా బిజెపి నేతలు భావిస్తున్నారు. అందుకే తెలంగాణలోనూ ఎలాగైన గంటకొట్టాలన్న ఆత్రుతలో ఉన్నారు. చంద్రబాబు నాయుడుకు భారతీయ జనతా పార్టీతో శాశ్వత మిత్రత్వం ఎప్పుడూ లేదు. గతంలో కూడా ఆయనను పొమ్మనలేక పొగపెట్టడంతో బఎన్‌డిఎ కూటమి నుంచి బయటకు వచ్చారు. దీంతో జగన్‌కు పరోక్షంగా బిజెపి మద్దతు ఇచ్చింది. ఇక్కడ కెసిఆర్, అక్కడ జగన్ అవినీతిపై బాకాలూదిన బిజెపి నేతలు ఒక్క కేసులోనూ తేల్చలేకపోతున్నారు. ఇకపోతే లడ్డూ వివాదం చంద్రబాబు నాయుడు లేవనెత్తగానే బిజెపి దేశవ్యాప్తంగా దానిని తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేసింది. పవన్ కళ్యాణ్ ఇప్పుడు ప్రతిపాదిస్తున్న వారాహి డిక్లరేషన్ ప్రకారం దేశవ్యాప్తంగా సనాతన ధర్మ పరిషత్ ఏర్పడితే .. తిరుమల తిరుపతి దేవస్థానం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతుల్లోంచి వెళ్లిపోతుంది. ఇది చేయడానికి కేంద్రం ముందుకు వస్తుందా అన్నది ముఖ్యం. దీనికి చంద్రబాబు అంగీకరిస్తారా అన్నది మరీ ముఖ్యం. అందుకే ఇప్పుడు ఎపిని వదిలి తెలంగాణపై పడ్డారు. రుణమాఫీ పూర్తిగా జరగలేదని గోలపెడుతున్నారు. వ్యవసాయ చట్టాలతో వందాలాదిమందిని పొట్టన పెట్టుకుని, వెనక్కి తగ్గని మోడీ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడంలోనే రాజకీయం ఉంది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఢిల్లీ, బీహార్, బెంగాల్, తమిళనాడు, అసోం రాష్ట్రాల్లో ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కనుక మంచి ఫలితాలు సాధిస్తే కేంద్ర ప్రభుత్వానికి ఢోకా ఉండదు. అప్పుడు వారు అనుకున్నట్లుగా జమిలి ఎన్నికల జమానా కూడా రాగలదు. అయితే ఈ రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి మంచి ఫలి తాలు సాధించగలదా అనేది అనుమానమే. ప్రస్తుతం జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల్లో బిజెపికి మిశ్రమ ఫలితాలు వచ్చాయి. అయినా తన ప్రయత్నాలు మరింత పక్కాగా అమలు చేసే క్రమంలో దక్షిణాదిలో విజయం సాధించే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణలో రేవంత్ ప్రభుత్వాన్ని చీకాకు పెట్టాలని చూస్తోంది. రుణమాఫీ జరగలేదని, ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని వాదిస్తోంది. 2014లో తెలంగాణ రాష్ట్రం సాధించి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ స్వయంకృతా పరాధం కారణంగా బిజెపి ఈ స్థాయికి ఎదిగిందనడంలో సందేహం లేదు. తెలంగాణలో బలంగా ఉన్న కాంగ్రెస్‌ను మాటుమాయం చేసే ఆత్రుతలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలు బిజెపి బలోపేతం కావడానికి దోహదపడ్డాయి

## ఫీజు రియుంబర్స్‌మెంట్ చెల్లింపులో వివక్ష

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 19 వేల కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విడుదల చేయడం జరిగింది. ప్రతి ఏడాది సగటున క్రమం తప్పకుండా రెండు వేల కోట్లు విడుదల చేసిందని, కరోనా వంటి సంక్షోభ సమయంలోనూ ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికి కేవలం విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లో ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్య పట్ల తమకున్న ప్రాధాన్యాన్ని చాటి చెబుతుందని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. దసరా, దీపావళి వేళ సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేక పోతున్నామని అసోసియేషన్ సభ్యులు వివరించారు. సిబ్బంది నుండి తమపై విపరీతమైన ఒత్తిడి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భవనాల అ÷-దదెలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు వడ్డీలు కట్టలేక, కొత్త అప్పులు దొరక్క కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు చెల్లించేలా ప్రభుత్వాన్ని నిలదీస్తాం..ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## సుప్రీం తీర్పుకు విరుద్ధంగా నియామకాలు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నిరసనలకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మందకృష్ణ ప్రశ్నించారు. వర్గీకరణ చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించి, ధర్నా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహాల నుంచి కలెక్టరేట్ల వరకు ర్యాలీలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలి. హైదరాబాద్ నగరంలో ట్యాంక్ బండ్ నుంచి బషీర్‌బాగ్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మందకృష్ణ మాదిగ తెలిపారు.రేవంత్ సర్కార్ తమకు నమ్మక ద్రోహం చేసిందని మందకృష్ణ ధ్వజమెత్తారు. మాదిగలకు సీట్లు తగ్గడానికి కూడా రేవంత్ రెడ్డినే కారణం అన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారు. అసెంబ్లీలో ప్రకటించిన మాదిరిగా.. రేవంత్ రెడ్డి అన్ని ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి బషీర్ బాగ్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని.. మాదిగలను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగల పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్లు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆచరించడం లేదని.. మాలల పక్షాన నిలుస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాలలకు కొమ్ము కాస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా మాదిగలకు తక్కువ సీట్లు ఇచ్చి.. మాలలకు ఎక్కువ టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల్లో మాదిగలకు నాలుగు సీట్లు తగ్గడానికి కారణం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. వివేక్, వినోద్ ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా.. వంశికి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. పార్టీ మారి వచ్చిన వివేక్ కుటుంబంలో రెండు సీట్లు ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి వాళ్లతో కుమ్మక్కయ్యారని విమర్శించారు. కడియం శ్రీహరిని తానే ఆహ్వానించానని రేవంత్ రెడే చెప్పారని.. సిట్టింగ్ ఎంపీ అయిన పసునూరు దయాకర్‌కు టికెట్ రాకుండా అడ్డుకున్నారని చెప్పారు. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణను తొలుత దేశంలో అమలు చేసే రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన అర్ధ గంటకే రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగాలకు కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారని తెలిపారు. అయితే రెండు నెలలు కాకముందే రేవంత్ రెడ్డి మాదిగలకు వెన్నుపోటు పొడిచారని విరుచుకుపడ్డారు. ఎస్సీ వర్గీకరణ జరగకుండా ఎలాంటి నియామకాలు జరపవద్దని కోరామన్నారు. వర్గీకరణ లేకుండానే రేపు 11 వేల ఉపాధ్యాయ ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వబోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి పదవి కోల్పోకుండా ఉండేందుకు రేవంత్ రెడ్డి మాదిగలకు ద్రోహం చేస్తున్నారన్నారు. మాల సామాజికవర్గానికి చెందిన మల్లిఖార్జున్ ఖర్గే, కొప్పుల రాజు ఆగ్రహానికి గురై పదవి కోల్పోవాలా అని రేవంత్ రెడ్డి మాదిగ ఎమ్మెల్యేలతో అన్నారని ... అవసరమైతే త్వరలో ఆ ఎమ్మెల్యేల పేర్లు బయట పెడుతానని అన్నారు. రేవంత్ రెడ్డి మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీసీ మంత్రి అయిన పొన్నం ప్రభాకర్‌ను చూసి గర్వపడుతున్నానని.. దామోదర్ రాజనర్సింహను చూసి సిగ్గుపడుతున్నా అని అన్నారు. బీసీ సమావేశాలకు హాజరై కులగణన జరిగే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు జరగవని పొన్నం ప్రభాకర్ గట్టిగా చెబుతున్నారన్నారు. బీసీల ప్రయోజనాల కోసం పొన్నం ప్రభాకర్ ధైర్యంగా మాట్లాడు తున్నారని చెప్పారు. మాదిగ కోటాలో మంత్రి అయిన దామోదర్ రాజనర్సింహ మాదిగల ప్రయోజనాల కోసం మాట్లాడటం లేదని మండిపడ్డారు. జాతి ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటే వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు ఆపాలని.. లేకపోతే బయటకు రా దామోదర రాజనర్సింహ అంటూ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు.

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని జీతాలు

మొదటిపేజీ తరువాయి

చిరుద్యోగులు కుటుంబాలను నెట్టుకురావడానికి అప్పులు చేసి నానా తిప్పలు పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఒకటో తారీఖునే జీతాలు ఇస్తామని పలికిన ప్రగల్భాలు ఎటుబాయె..? దసరా దగ్గరికి వచ్చింది..సరుకులు కొనడానికి చేతిలో నయాపైసా లేదు..! నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో డితే బతుకు బండి నడిచేదెట్లా..? 10 నెలల్లో తెచ్చిన రూ. 80 వేల కోట్లు అప్పులు ఎక్కడికి పోయినయ్..? చిరుద్యోగులు.. చిన్నజీతాల కార్మికుల అవస్థలను పట్టించుకోండి..వెంటనే వేతనాలు చెల్లించండి అని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఈడీ విచారణకు హాజరైన మాజీ ఎంపీ అజహరుద్దీన్

మొదటిపేజీ తరువాయి

దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా అజహర్ మాట్లాడుతూ తనపై వచ్చినవి తప్పుడు ఆరోపణలని చెప్పారు.

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియానికి సంబంధించి జనరేటర్లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు సంబంధించి రూ.20 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అజహర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని ఆదేశించింది.

## యూ ట్యూబర్‌పై కేసు.. కెటిఆర్ ఆగ్రహం



యూ ట్యూబర్, జర్నలిస్టు గౌతమ్ గౌడ్ కేసు నమోదు చేయడంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఓ రైతు ఆవేదనను గౌడ్ యూట్యూబ్‌లో పెట్టారని, అంతమాత్రానికే కేసు పెడతారా అని, ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అసలు ఈ వీడియోలో తప్పేముంది..? జర్నలిస్టు గౌతమ్ గౌడ్‌పై కేసు ఎందుకు నమోదు చేశారు..? అని తెలంగాణ డీజీపీని కేటీఆర్ ప్రశ్నించారు. నేను కూడా ముషంపల్లిలో రైతు మల్లయ్యను కలిశాను. అతనితో మాట్లాడాను. మరి నాపై కేసు పెడుతారా..? అని డీజీపీని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.నల్లగొండ జిల్లాలోని ముషంపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే రైతు.. కాంగ్రెస్ పార్టీని అనవసరంగా గెలిపించామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో సాగునీరు వచ్చింది. 24 గంటల నాణ్యమైన కరెంట్ అందింది. ఏడాదికి రెండుసార్లు రైతుబంధు జమ చేశారు. కానీ రేవంత్ పాలనలో రైతుబంధు రాక అప్పులపాలవుతున్నామని, మళ్లీ కేసీఆరే రావాలి.. నాతో పాటు మరో పది మందితో కేసీఆర్‌కు ఓట్లు వేయిస్తామని రైతు మల్లయ్య ఆవేదనతో మాట్లాడారు. రైతు మల్లయ్య మాట్లాడిన వీడియోను జర్నలిస్టు గౌతమ్ గౌడ్ యూట్యూబ్‌లో పోస్టు చేశారు.

## కాశ్మీర్ ఫలితాలు బిజెపికి దెబ్బ!

కేంద్రంలోని బిజెపి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నా ..ప్రజలు పెద్దగా ఆమోదించడం లేదు. ప్రజలు వాటిని గుర్తించడం లేదు. ప్రజలు తమ జీవికకు సంబంధించి మాత్రమే ఆలోచిస్తారు. దేశం గురించి ఆలోచించే స్థితిలో లేరు. అందుకే దేశం రెండువేల ఏళ్ల పాటు పరాయిపాలనలో మగ్గింది. దేశం ముక్క చెక్కలయ్యింది. అయినా ప్రజల్లో ఇది నా దేశం అన్న భావన రావడం లేదు. ఇజ్రాయిల్ తరహాలో ఇది నా జన్మభూమి అన్న భావన కలగడం లేదు. దేశంతో ఉన్న అనుబంధం తెగిపోవడమే ఇందుకు కారణం. విభజన సమయంలో ప్రజలు తిరుగుబాటు చేయలేక పోయారు. స్వాతంత్ర్య ఉద్యమం ఉవ్వెత్తున సాగినా స్వరాజ్యం సిద్ధించడంలో ఆలస్యానికి ప్రజల్లో పట్టుదల లేకపోవడమే కారణమని విశ్లేషకుల అభిప్రాయం. ఇదంతా ప్రస్తావన ఎందుకంటే..కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు.. అయోధ్యలో రామజన్మభూమిలో రామాలయ నిర్మాణం తరవాత జరిగిన ఎన్నికలను విశ్లేషించినప్పుడు ఈ విషయం స్పష్టంగా గోచరమయ్యింది. కాశ్మీర్ ఎన్నికల్లో బిజెపి పూర్తిగా అధికారం పొందలేకపోయింది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో అయోధ్యతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రలజు బిజెపియేతర పార్టీలకు పట్టం కట్టారు. ఇలా ఎందుకు జరుగుతుందో అని బిజెపి పాలకులు లెక్కలు వేయడం లేదు. 370 రద్దు చేసిన తరవాత కాశ్మీర్ తప్ప దేశంలోని మిగతా ప్రాంతాల ప్రజలు హర్షించారు. అయోధ్య ఆలయ నిర్మాణం తరవాత కూడా దేశమంతా, ప్రపంచమంతా హర్షించింది. కానీ ఓట్లు మాత్రం బిజెపికి పడలేదు. ఇక్కడ ఓట్లు వేరు..విధాన నిర్ణయాలు వేరని బిజెపి గుర్తించడం లేదు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవలసిందే. అలాగే ప్రజల బాగోగులు, వారి సమస్యలను కూడా చర్చించా ల్సిందే. కానీ బిజెపి అలా చేయడం లేదు. దీంతో ప్రజలు బిజెపి నిర్ణయాలను స్వాగతించినా..ఓట్లను మాత్రం వేయడం లేదు. ఈ విషయంలో బిజెపి అధ్యయనం చేయడం లేదనే చెప్పాలి. ప్రజలకు మెరుగైన పాలన అందించడం వేరు..విధాన నిర్ణయాలు తీసుకుని అమలు చేయడం వేరని గుర్తించలేకపోతోంది. ప్రజలకు కావాల్సింది బతకడానికి అనువైన పరిస్థితులు. పనిచేసుకునేలా ఉపాధి అవకాశాలు రావాలి. పరిశ్రమలు రావాలి. విద్య, వైద్య రంగాల్లో పరిస్థితులు మెరుగు పడాలి. పన్నుల హేతుబద్ధీకరణ జరగాలి. పేదలు నేరుగా పాఠశాలలకు వెళ్లి చదువుకోగలగాలి. జబ్బు చేస్తే నేరుగా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించు కోగలగాలి. అలాంటి వాటిపై దృష్టి పెట్టడంలో బిజెపి పూర్తిగా విఫలం అయ్యిందనే చెప్పాలి. విద్యావైద్య రంగాలను బలోపేతం చేసేలా బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. రవాణా సౌకర్యాలు మెరుగు పడాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలగాలి. ఇవన్నీ చేసేందుకు అవసర మైన నిధులు కేటాయించాలి. రవాణా ధరలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలి. రూపాయికి విలువ లేని కాలమిది. వంద రూపాయాలకు భోజనం దొరకని గడ్డుకాలమిది. ఇలా ఎందుకు జరుగుతుందో..ఎందుకు దరలు విపరీతంగా పెరుగుతున్నాయో అన్న విషయాలపై కేంద్రం చర్చించడం లేదు. విశ్లేషించడం లేదు. ఇకపోతే ఉపాధి కోసం సొంతంగా కాళ్లపై నిలబడాలనుకునే వారికి రుణాలు విరివిగా దక్కాలి. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రుణాలు తక్కువ వడ్డీలకు దక్కాలి. పనిచేసేందుకు అవకాశాలు రావాలి. కానీ అలా జరగడం లేదన్న విషయం గుర్తించి నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపతేం చేసే దిశగా ప్రయత్నాలు సాగడం లేదు. మోడీ మాటలు కోటలు దాటడం లేదు. అందమైన మాటలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని గుర్తించాలి. అందుకే వ్రతం చెడినా ఫలితం దక్కలేదన్న సామెత ఇప్పుడు బీజేపీకి సరిగ్గా సరిపోతుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో,నేటి జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాలు చూస్తే ఇదే స్పష్టం అవుతుంది. 500 ఏళ్ల హిందువుల కల అయోధ్య రామ మందిర నిర్మాణం చేపట్టినా, ఆర్టికల్ 370 రద్దు చేసినా బీజేపీకి చేదు ఫలితం ఎదురైంది. రామ మందిరాన్ని కట్టించి హిందువుల చిరకాల కోరికను నిజం చేసి చూపించారు ప్రధాని మోదీ. అవాంతరాలు, అడ్డంకులు..కోర్టు కేసులు..వివాదాలు అన్నీ ఒక్కొటిగా దాటుకుని భవ్య రామ మందిరం నిర్మాణం పూర్తి చేశారు. రాముడి ప్రతిష్ఠ జరిపారు. దేశమంతా హర్షించింది. అయోధ్య రాముడి సమస్యకు ఇన్నాళ్లకు ఓ పరిస్కారం దక్కిందని దేశ ప్రజలు సంతోష పడ్డారు. అయితే రామ మందిరం నిర్మాణం పూర్తి చేశామన్న ఉత్సాహంతో లోక్ సభ ఎన్నికలకు దిగిన బీజేపీకి ఊహించని షాక్ తగిలింది. అయోధ్య అసెంబ్లీ ఉన్న ఫైజాబాద్ లోక్ సభ నియోజకవర్గాన్ని ఇండీ కూటమిలోని సమాజ్ వాదీ పార్టీ గెలుచుకుంది. అంటే ఇన్నేళ్ల కలను తీర్చిన అయోధ్య ప్రజలు చుట్టు పక్కల నియోజకవర్గాల వాళ్లు బీజేపీని తిరస్కరించారు. ఇది బీజేపికి ఊహించని షాక్ అని చెప్పవచ్చు. అంటే అయోధ్య ఆలయం వద్ద చుట్టుపక్కల ప్రజల జీవితాలు మాత్రం మారలేదు. అయోధ్ అభివృద్ధిలో స్థలాలు కోల్పోయిన వారు ఆనందంగా లేరు. వారికి తగిన పరిహారం దక్కలేదు. తాజాగా రెండో షాక్ తగిలింది. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌ను పూర్తిగా భారత్‌లో విలీనం చేసినా ఫలితలం లేకుండా పోయింది. కారణం అప్పటికే అక్కడి హిందువులను తన్ని తరిమేశారు. దీంతో అక్కడ పూర్వం నుంచి ఉంటూ వచ్చిన హిందువులు, పండిట్లను కాశ్మీర్‌కు తిరిగి తీసుకుని రాలేక పోయారు. ఆర్టికల్ 370 రద్దు కోసం బీజేపీ ప్రభుత్వం ఏళ్లుగా వ్యూహం పన్నింది. ఫలితంగా కశ్మీర్ రాష్ట్రం హోదా కోల్పోయి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. జమ్ము కశ్మీర్ , లద్దాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలు కొత్త ప్రయాణం మొదలు పెట్టాయి. 370 రద్దు తర్వాత తొలిసారిగా అక్కడ ఎన్నికలు జరిగాయి. పాకిస్థాన్ కబంధ హస్తాల్లోనూ..వేర్పాటు వాద శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్న కశ్మీర్‌ను పూర్తిగా దేశం చేతుల్లోకి తెచ్చుకునేలా.. చేసిన చర్యకు దేశభక్తితో ప్రజలంతా ఉప్పొంగిపోయారు. కానీ స్థానికంగా ఉన్నవారు మాత్రం పాక్ మనస్థత్వం నుంచి బయటపడలేదు. అందుకే అక్కడి ప్రజలు బీజేపీకి పట్టం కట్టలేదు.

## నాంపల్లి కోర్టులో నాగార్జున వాంగ్మూలం

మొదటిపేజీ తరువాయి

ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. పిటిషన్ విచారణకు స్వీకరించిన న్యాయస్థానం తమ ఎదుట హాజరై వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా నాగార్జునకు తెలిపింది. దీంతో ఆయన తన సతీమణి అమల, కుమారుడు నాగచైతన్యతో కలిసి నాంపల్లి కోర్టు ఎదుట హాజరయ్యారు. ఎందుకు పిటిషన్ దాఖలు చేశారని నాగార్జునను న్యాయస్థానం ప్రశ్నించింది. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వల్ల తమ కుటుంబ పరువు మర్యాదలకు భంగం వాటిల్లిందని ఆయన కోర్టుకు వాంగ్మూలం ఇచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని, అన్ని టెలివిజన్ ఛానళ్లు, పత్రికల్లో ఆ వ్యాఖ్యలు వచ్చాయని తెలిపారు. అసత్య ఆరోపణలు చేసిన ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టుకు విన్నవించారు. నాగార్జున ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డు చేసింది.

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. 2017లో నా కుమారుడు నాగచైతన్య, సమంత... వివాహ బంధం ద్వారా ఒక్కటయ్యారు. వ్యక్తిగత కారణాలతో 2021లో విడిపోయి ఇద్దరూ గౌరవప్రదంగా జీవిస్తున్నారు. దశాబ్దాలుగా పేరు

కరపత్రం తెలుగు దిన పత్రిక
బుధవారం అక్టోబర్ 09 2024

# ఘన్ముక్ల మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్య ఇంటర్న్ షిప్..

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మొయిజ్ బేగ్ ...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 7.**
వీణవంక మండల పరిధిలోని గన్ముకుల మోడల్ స్కూల్ విద్యార్థులు వృత్తి విద్య ఇంటర్న్ షిప్ ( టూరిజం,హాస్పిటాలిటీ) లో భాగంగా దసరా సెలవుల్లో పది రోజుల పాటు కరీంనగర్ లోని ప్రముఖ శ్వేత హెూటల్ ను ఒకేషనల్ ట్రైనర్ బొడ్డుపల్లి లక్ష్మీకాంత్ పర్యవేక్షణ లో సందర్శించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఘన్ముక్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మొయిజ్ బేగ్ మాట్లాడుతూ... వృత్తి విద్య ఇంటర్న్ షిప్ లో భాగంగా ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు కరీంనగర్ లోని ప్రముఖ శ్వేతా హెూటల్ ను సందర్శించి ప్రయోగ పూర్వక జ్ఞానాన్ని పొందుతారని తెలిపారు. ఈ ట్రైనింగ్ వల్ల విద్యార్థులు నిజ జీవితంలో సొంతంగా రాణించడానికి, భవిష్యత్తులో మరింతగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఒకేషనల్ ట్రైనర్ లక్ష్మీకాంత్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.







## బహుజన బతుకమ్మ పాటను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, అరుణోదయ విమలక్క..

- కవి, గాయకులు గోనెల సమ్మన్న..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 7.**
హుస్నాబాద్ పట్టణంలో సోమవారం సాయంత్రం 7 గంటలకు జరిగిన బహుజన బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు ,ప్రజా గాయకురాలు విమలక్కల చేతులమీదుగా వీణవంక మండలం, మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కవి ,గాయకులు గోనెల సమ్మన్న ముదిరాజ్ రాసి ,పాడిన బతుకమ్మను బతుకనియ్యరే ఓ సెల్లెలార అనే బహుజన బతుకమ్మ పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, విమలక్కలు మాట్లాడుతూ... ఈ తరం మహిళలు పాశ్చాత్య సంస్కృతి బాటలో పయనిస్తూ, విష సంస్కృతి బాటబడుతూ,డీజె బాక్స్ లు పెడుతూ, దాండియ కోలలు పడుతూ, తెలంగాణ పువ్వుల పండుగను చెడగొట్టొద్దని మన తెలంగాణ సంస్కృతిని ,సాంప్రదాయాన్ని ముందు తరాలకు మన పిల్లలకు నేర్పించాలని పాట రాసి, పాడిన గోనెల సమ్మన్న ముదిరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ కళాకారులు బుల్లెట్ వెంకన్న ముదిరాజ్,పల్లె లింగన్న ముదిరాజ్, చంద్రకళ ముదిరాజ్,భాస్కర్, రాజశేఖర్, పెద్దులు ముదిరాజ్, ముద్దసాని శ్రీనివాస్ ,బండారి రవి పటేల్, గంధం సుమన్ ,రాజు , వేణు ముదిరాజ్ లు పాల్గొన్నారు.



## మొలంగూర్ లో మహాశక్తి యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి మహా లక్ష్మీ అవతారం... కుంకుమ పూజ...



- భారీగా తరలివచ్చిన భక్తజనం...

**కరపత్రం శంకరపట్నం అక్టోబర్ 8**
దసరా పండుగను పురస్కరించుకొని దేవీ నవరాత్రోత్సవాలు భాగంగా మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట మండలం మొలంగూర్ గ్రామంలోని మహాశక్తి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాతకు మహాలక్ష్మి అవతారం అలంకరించి కుంకుమ పూజ వేద పండితుల మంత్రోత్సవాల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళా భక్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశక్తి యూత్ ఆలయ అర్చకులు భగిమతం శివప్రసాద్, ఫణిదర్ మాట్లాడారు. దసరా పండగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించుకునే అతిపెద్ద పండగ కావడంతో విజయదశమిని పురస్కరించుకొని అన్ని విజయాలే కలగాలని అమ్మవారు ప్రసాదించేలా దుర్గాదేవి నవరాత్రోత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని, భాగంగా ములంగూర్ మహాశక్తి యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గాదేవి నవరాత్రి ఉతవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మండపం వద్ద రాష్ట్ర ప్రజలకు, పాడి పంట, సుఖ సంతోషాలు ఆర్థిక అభివృద్ధి ప్రసాదించాలని అమ్మవారిని, ప్రత్యేకంగా మహాలక్ష్మి,అవతారంగాఅలంకరించి,కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు పూజారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాశక్తి యూత్ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నిత్యవసర ధరలు తగ్గించాలి

## జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

-సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 8**
విపరీతంగా పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ...కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ, పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తుందని, పెరిగిన నిత్యవసర ధరలు వెంటనే తగ్గించాలని, పెట్రోల్ డీజిల్ ధరలను జిఎస్టి పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువులపై అధికంగా టాక్సీలు పెంచడంతో నిత్యవసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగాయన్నారు. నరేంద్ర మోడీ దేశం కోసం,ధర్మం కోసం అంటూ దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముకుంటున్నారని,నేషనల్ మోనిటేషన్ పైప్ లైన్ పేరుతో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేశారని అన్నారు. 2024 ఏప్రిల్ నుండి అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్ కి 89.40 డాలర్ల నుండి 73. 59 డాలర్లకు పడిపోయిందని, దాదాపు 18 శాతం మేర తగ్గిందన్నారు. అయినా మోడీ ప్రభుత్వ ఆదేశాల మేరకు చమురు ఉత్పత్తి కంపెనీలు దేశంలో రిటైల్లో పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించలేదన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు అధిక ద్రవ్యోల్బణానికి దోహదపడతాయన్నారు. కూరగాయలు, ఆహార ధాన్యాలు, ఇతర నిత్యవసర వస్తువుల ధరలు పెరగడానికి కారణం అవుతాయన్నారు. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర క్యాబినెట్ ఇటీవల ఆమోదించిన ఒకే దేశం ఒకే ఎన్నిక భావనను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది అన్నారు. పార్లమెంటు, శాసనసభ, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి తీసుకునే చర్యలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు, సమైక్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తాయన్నారు రాష్ట్రాల శాసనసభకు ఐదేళ్ల కాలపరిమితి కల్పిస్తున్న రాజ్యాంగాన్ని ఇది ఉల్లంఘిస్తుంది అన్నారు. రాష్ట్రాల హక్కులను నులిపేసే జమిలీ ఎన్నికలను తిరస్కరించాలని ఉన్నారు. మణిపూర్ లో హింస ఇంకా కొనసాగుతూనే ఉందని ఈ16నెలల కాలంలో ప్రధాని మోడీ ఒక్కసారి కూడా ఆ రాష్ట్ర పర్యటనకు వెళ్లలేదన్నారు సమస్య పరిష్కారానికి అవసరమైన రాజకీయ చర్చలు తీసుకోవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ కు ఆయుధాల ఎగుమతులపై తక్షణమే నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని నవంబర్ 15 వరకు సభలు,సమావేశాలు, సదస్సుల ద్వారా ప్రజానీకానికి వివరిస్తూ, ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి,గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు యు.శ్రీనివాస్,సుంకరి సంపత్, ఎడ్ల రమేష్,నరేష్ పటేల్, జిల్లా నాయకులు జి.తిరుపతి, తిప్పారపు సురేష్, గజ్జల శ్రీకాంత్,కాంపల్లి అరవింద్, రాయికంటి శ్రీనివాస్,గుండేటి వాసుదేవ్,గాజుల కనకరాజు, వినయ్ కుమార్,రోహిత్, జగదీష్,మల్లారెడ్డి, సత్యనారాయణ చారి,బోగేష్ తదితరులు పాల్గొన్నారు.




## గత కొన్ని రోజులుగా నెలకొన్న కంకర క్రషర్స్ వివాదంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనింగ్ డైరెక్టర్ తాత్కాలికంగా నిలుపు వేయుటకు ఉత్తర్వులు జారీ


-సంతోషం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు
- మా గ్రామ ప్రజలు న్యాయ పోరాటాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా ఉండి వివిధ పత్రికలలో ప్రచురణ
- సంపూర్ణ సహకారం అందించిన ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా ప్రతినిధులకు అభివందనాలు తెలియజేస్తున్న గ్రామస్తులు
- అంబేద్కర్ విగ్రహం వద్ద మైనింగ్ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను ప్రదర్శిస్తూ మా గ్రామం సుభిక్షంగా ఉండటం కోసం ఎంతటి న్యాయపోరాటికైనా సంసిద్ధమవుతాం అన్న గ్రామస్తులు

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.**
సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామ శివారులో సర్వేనెంబర్ 286 అసైన్ భూమిలో కొందరు యజమానులు అక్రమంగా నకిలీ పత్రాలను పొంది కంకర క్రషర్ పనులు కొనసాగించడంతో గ్రామాన్ని కాపాడడం కోసం న్యాయ పోరాటానికి గ్రామ ప్రజలు సిద్ధమయ్యారు గత కొన్ని రోజులుగా పూర్తి ఆధారాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ డైరెక్టర్ వద్దకి మా గ్రామ సమస్యను వివరిస్తూ మా వాదనలు వినిపియడంతో మైనింగ్ ఇరిగేషన్ పొల్యూషన్ రెవెన్యూ అధికారులకు సమిష్టిగా విచారణ జరిపి పూర్తి నివేదికనివ్వాలని కోరగా ఇరుపక్షాల వాదోపవాదాలు విన్న తర్వాత కంకర క్వారీలపై పనులు నిలిపివేయాలని ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది దానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలపడం జరిగింది అట్టి ఆర్డర్ కాపీని మండల తహసిల్దార్, సి.ఐ జిన్నారం, ఎస్ ఐ జిన్నారం వారికి అందజేయడం జరిగింది. ప్రభుత్వ మైనింగ్ శాఖ ఉత్తర్వులను అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, తగు సమాచారం నిమిత్తం సంబంధిత ప్రభుత్వ అధికారులకు అందజేస్తూ, ఇట్టి కంకర క్వారీ క్రషర్స్ యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్ని భవిష్యత్తులో ప్రభుత్వ అనుమతులను ఉల్లంఘించకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సంబంధిత అధికారులు కోరడం జరిగింది,సంబంధిత ప్రభుత్వ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులను కంకర క్వారీ క్రషర్స్ యాజమాన్యం ఉల్లంఘించినచో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాం మా గ్రామాన్ని పరిరక్షించుకుంటాం ఏదైనా అవాంఛనీయ సమస్యలు తలెత్తితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నత అధికారులు పూర్తి బాధ్యత వాయించాల్సిందిగా రాళ్లకతో గ్రామ ప్రజలం ప్రభుత్వానికి తెలియజేస్తున్నాం అన్నారు.



## 12దళిత రెండో విడత నిధులు విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కి వినతి పత్రం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 8**
హుజరాబాద్ నియోజకవర్గంలో రెండవ విడత దళిత బంధు నిధులను విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి వినతి పత్రాన్ని పంపినట్లు మాజీ జెడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జమ్మికుంట పట్టణంలో మాట్లాడుతూ...... గత రాష్ట్ర ప్రభుత్వం హుజురాబాద్ నియోజకవర్గం దళిత బంధు పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడం చేశారు. అందులో భాగంగా ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షల రూపాయల చొప్పున నిధులను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించారని వారు గుర్తు చేశారు. కొంతమంది లబ్ధిదారులకు మాత్రమే 10 లక్షల రూపాయలు మొత్తం నిధులు కేటాయించారు మిగతా కొంతమంది దళిత కుటుంబాలకు కేవలం ఐదు లక్షల రూపాయలు మాత్రమే వారికి చెందాయని వారు గుర్తు చేశారు. మిగతా ఐదు లక్షల రూపాయలు కేటాయించవలసిందిగా దళిత కుటుంబాలు కరీంనగర్ జిల్లాకు సంబంధించిన అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన వారికి న్యాయం జరిగే లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దళిత కుటుంబాలు 5 లక్షల రూపాయలతో అనేక వ్యాపారలు కొనసాగిస్తున్నారని వాటి మూలంగా ఎక్కువ మొత్తంలో ఆదాయం రాకపోవడం మూలంగా వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని వారు గుర్తు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గం దళిత బంధు కుటుంబాలు రెండవ విడత నిధులను విడుదల చేయవలసిందిగా అనేకసార్లు రాస్తారోక అనేక కార్యక్రమాలు చేసినప్పటికీ కూడా అధికారులు స్పందించకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండోవ విడత దళిత బందును వెంటనే విడుదల చేయవలసిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరడం జరిగిందన్నారు.



## ప్రభుత్వ మాతా శిశు సంక్షేమ కిట్టు చేసిన మున్సిపల్ చైర్మన్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 8**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జమ్మికుంట మున్సిపల్ కార్మికులకు స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా నేత్ర వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని వారికి మహిళా ఆరోగ్య కిట్ అందించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావులి , స్థానిక కౌన్సిలర్ దిడ్డి రాము ,మేనేజర్ రాజిరెడ్డి,అప్తమాజిస్ట్ జలెందర్, సూపరిండెంట్ శ్రీకాంత్ రెడ్డి,సూపర్వైజర్ మోహన్ రెడ్డి,మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఆసుపత్రి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు...



# గేమ్ చేంజర్ టీజర్ డేట్ ఛేంజ్

## దసరాకు కాదు...దీపావళికి అంటూ తమన్ పోస్ట్

రామ్‌చరణ్- శంకర్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్' టీజర్ దసరాకు రావడం లేదు. దీపావళికి వస్తుందని తాజాగా దీనిపై సంగీత దర్శకుడు తమన్ పోస్ట్ పెట్టారు. టీజర్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. దసరాకు టీజర్ రాలేదని నిరాశపడొద్దు ఫ్రెండ్స్. టీమ్ నిరంతరం ఆ పనుల్లోనే ఉంది. ప్రతినెలా ఒక లిరికల్ పాటను విడుదల చేయడం కోసం అన్ని పాటలకు లిరిక్స్ వర్క్ పూర్తి చేశాం. ఈ నెలలో అక్టోబర్ 30న ఒక పాట రానుంది. సినిమా డిసెంబర్ 20న కచ్చితంగా మీ ముందుకువస్తుంది' అని పోస్ట్ పెట్టారు. 'రా మచ్చా..' సాంగ్ వంద మిలియన్ల వ్యూస్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇక ఓ నెటిజన్‌కు రిప్లై ఇస్తూ.. దీపావళికి టీజర్ ఉంటుందన్నారు. 'దీని టీజర్ కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారని మేం అర్థం చేసుకోగలం. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. అవుట్‌పుట్ కోసం ఎక్కడా రాజీపడడం లేదు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. దసరాకు విడుదల కాకపోతే దీపావళికి టీజర్ ఉంటుంది. దీనికి సంబంధించిన అప్‌డేట్స్ నేను ఎప్పటికప్పుడు అందిస్తుంటాను. మీరంతా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా' అని అన్నారు. 'గేమ్ ఛేంజర్' విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్




నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వాణీ హీరోయిన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి.

# పుష్ప-2 కోసం శరవేగంగా షూటింగ్



మూడేళ్ళుగా బన్నీ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం పుష్ప 2..అనేక కారణాల వల్ల ఈ సినిమా షూట్ ఆలస్యం అవుతూ వచ్చింది. ఈ క్రమంలో సినిమా రిలీజ్ డేట్ కూడా రెండు మూడు సార్లు మార్చారు. అందరి అభిమాన స్టార్ హీరోల నుండి సినిమాలు వస్తున్న బన్నీ ఫ్యాన్స్ కళ్ళు మాత్రం కాయలు కట్టాయి. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సుకుమార్ సినిమాని జెట్ స్పీడ్‌లో ముందుకు తీసుకెళ్తున్నాడు. ఓ వైపు గ్లిమ్ప్స్, సాంగ్స్ అప్డేట్స్‌కి మంచి ఆదరణ లభించగా.. మరో రెండు వండర్ ఫుల్ అప్డేట్స్ ఫ్యాన్స్‌లో జోష్ పెంచుతున్నాయి. పుష్ప మేకర్స్ ఇప్పటికే ఈ సినిమాని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో షూటింగ్ లో వేగం పెంచిన దర్శకుడు సుకుమార్.. ఫస్ట్ హాఫ్ ఎడిట్ కాపీని లాక్ చేశారట. ఇక సెకండ్ హాఫ్ లో మిగిలి ఉన్న కొన్ని సన్నివేశాల షూట్ కోసం మూడు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఇందులో ఒక యూనిట్ రంపచోడవరంలో పని చేస్తుండగా మరో రెండు యూనిట్లు వైజాగ్, యానాంలో పని చేస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా రిలీజ్ దగ్గరపడటం, షూటింగ్ చకచకా సాగుతుండటం అభిమానులలో జోష్ పెంచింది. పుష్ప 1లో ఉన్న క్యారెక్టర్లనే ఈ సినిమాలో కొనసాగిస్తుండగా జగపతి బాబు అడిషినల్‌గా యాడ్ అయ్యారు. ఇక సినిమాలో ఒక ప్రత్యేకమైన ఐటమ్ సాంగ్ కోసం మొదట శ్రీలీలను సంప్రదించిన దిశా పటానిని ఓకే చేశారు. అయితే ఈ సినిమాలోని ఒక పోస్టర్ విషయానికొస్తే.. ఎర్ర చందనం వ్యాపారాన్ని చిటికెన వేలుపై నిలబెట్టి చేయదగలడని సూచనగా దాన్ని హైలైట్ చేస్తున్నట్టు వినిపిస్తోంది. సుకుమార్ తెరకెక్కించే ప్రతి సీన్‌కు ఓ లాజిక్, కొన్ని రిఫరెన్స్‌లు ఉంటాయి. 'రంగస్థలం'లో జగపతిబాబు పాత్రకు పామును రిఫరెన్స్‌గా తీసుకున్నారు. సినిమా ప్రారంభంలో పామును ఏ విధంగా అయితే కొట్టి చంపుతారో అలాగే జగపతిబాబుని కూడా అలాగే కొట్టి చంపినట్లు చూపించారు. మరి ఇప్పుడు అల్లు గోరును హైలైట్ చేయడం వెనుక ఏముందో సుకుమార్ చెబితేనే బాగుంటుంది.

# వెంకీ మూవీ సీరియల్ పై శ్రీను వైట్ల ఆసక్తి

రవితేజ హీరోగా శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీ' 2004లో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవడమే కాదు.. ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అందులోని పలు సన్నివేశాలను తలచుకోవడమే ఆలస్యం ప్రేక్షకుల ముఖాల్లో నవ్వులు పూస్తాయి. తాజాగా ఈ సినిమా సీక్వెల్ ఏ హీరోతో చేస్తారనే ప్రశ్నకు శ్రీను వైట్ల సమాధానమిచ్చారు. ఆయన తాజా చిత్రం 'విశ్వం' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో 'వెంకీ' గురించి మాట్లాడారు. వెంకీ' సీక్వెల్ ఎవరితో చేస్తాననేది చెప్పడం కష్టం. అందులో నటించే హీరో కచ్చితంగా నాకు మంచి స్నేహితుడై ఉండాలి. రవితేజ నాకు మంచి ఫ్రెండ్ కాబట్టి ఆ సినిమా అంత బాగా వచ్చింది. నేను ఏ హీరోతో చేసినా వాళ్లు నాకు స్నేహితులు అవుతారు. అలాంటి రిలేషన్ ఉన్నప్పుడే సినిమా బాగా వస్తుంది. ప్రస్తుతం చాలామంది టాలెంటెడ్ హీరోలు ఉన్నారు. వాళ్లందరూ కామెడీతో అలరిస్తున్నారు. వాళ్లలో ఎవరికైనా దీని సీక్వెల్ సెట్ అవుతుంది. ఒకరి పేరు చెప్పడం కష్టం అని చెప్పారు. 2004 మార్చి 26న విడుదలైన వెంకీ సంచలనం సృష్టించింది. రవితేజ పోషించిన వెంకీ పాత్ర, హీరోయిన్ స్నేహ నటించిన శ్రావణి పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో స్థానాన్ని సంపాదించుకున్నాయి. హీరో ఫ్రెండ్స్ గ్యాంగ్ అలాగే గజాలాగా బ్రహ్మానందం, బొక్కా సుబ్బారావుగా ఏవీఎస్.. ఇలా ప్రతిఒక్కరూ వారి కామెడీతో అదరగొట్టారు. ముఖ్యంగా ట్రైన్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ సినిమా దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ అవుతూనే ఉన్నాయి. దీనికి సీక్వెల్ రావాలని ఎంతోమంది కోరుకుంటున్నారు.






# రి-రిలీజ్‌లో 'తుంబాడ్' సెన్సేషన్..

## ఫస్ట్ రిలీజ్‌తో పోలిస్తే, మూడింతల వసూళ్లు

'తుంబాడ్'.. ఇప్పుడు భారతీయ సినీ ఇండస్ట్రీలో ఇదే సెన్సేషన్. స్టార్ హీరోలు, ఎలివేషన్స్, మాస్ సాంగ్స్, ఐటమ్ సాంగ్స్, కామెడీ ఇలా అన్నీ ఉన్న కొత్త సినిమాలే ఒక్కోసారి బాక్సాఫీస్ వద్ద ధమాల్ అంటున్న తరుణంలో ఆరేళ్ల తర్వాత రి-రిలీజ్ అయిన మూవీ రికార్డు వసూళ్లతో దూసుకుపోతోంది. నాలుగు వారాల్లో 'తుంబాడ్' రూ.31కోట్లకు (నెట్) పైగా వసూళ్లు సాధించింది. సినీ విశ్లేషకుడు తరుణ్ ఆదర్శ్ ఇదే విషయాన్ని చెబుతూ వారాల వారీగా కలెక్షన్లు పంచుకున్నారు. మొదటి సారి విడుదలై రాబట్టిన కలెక్షన్స్‌తో పోలిస్తే, ఇది ఏకంగా మూడింతలు కావడం గమనార్హమని సినీ ట్రేడింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకూ దాదాపు 1.25కోట్లకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి.




### భారీ అంచనాలతో మధ్య రి-రిలీజ్..

సెప్టెంబరు 13న మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'తుంబాడ్' మొదటి వారం ఏకంగా రూ.13.44కోట్లు వసూలు చేసింది. ఆ ఊపును కొనసాగిస్తూ రెండో వారం రూ.12.26కోట్లు రాబట్టింది. మూడో వారంలో రూ.4.70 కోట్లు, నాలుగో వారంలో 1.25కోట్లు వసూలు చేయగా మొత్తం రూ.31.65కోట్లు (నెట్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. గ్రాస్ కలెక్షన్ల పరంగా చూస్తే రూ.35కోట్లు దాటేసింది.రీ-రిలీజ్ సందర్భంగా 'తుంబాడ్' మూవీపై ప్రేక్షకులకు చూపించిన ఆదరణకు నటుడు సోహుమ్ షా ధన్యవాదాలు తెలిపారు. 'తుంబాడ్2' మొదలు పెట్టే ముందు ఇది తమకెంతో బలాన్ని ఇచ్చిందన్నారు. "మీరు చూపిన ప్రేమ, సహకారం వల్లే 'తుంబాడ్'లాంటి మూవీ వచ్చింది. ఇప్పుడు రెండో భాగాన్ని తీయడం మరింత సులభం చేసింది. ప్రస్తుతం మూవీకి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. స్క్రిప్ట్ పనులు కూడా చివరకు వచ్చాయి. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్తాం" అని అన్నారు.'తుంబాడ్' మూవీ మహారాష్ట్ర జానపద కథల నుంచి స్ఫూర్తిగా తీసుకుని తీర్చిదిద్దారు. వాస్తవ ప్రదేశాల్లో, నిజమైన వర్షం కురిసిన సమయంలోనే చిత్రీకరణ జరిగింది. రాహి అనిల్ బార్వే ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక రీ-రిలీజ్ సందర్భంగా విడుదల చేసిన 'తుంబాడ్2' టీజర్‌లో విజువల్స్ చూపిస్తూ 'మళ్లీ ఆ ద్వారం తెరుచుకుంటుంది' అని ఓ వ్యక్తి చెబుతుండగా, ఓ చిన్నారి 'హస్తర్ మళ్లీ వస్తుందా' అని అడిగితే 'ప్రళయం.. ప్రళయం వస్తుంది' అంటూ చెప్పిన డైలాగ్స్ ఒళ్లు గగర్పొడిచేలా ఉన్నాయి.


# రజనీకాంత్ సూచనతో

## ...వేట్టయాన్..కథలో మార్పు

రజనీకాంత్ హీరోగా టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించిన చిత్రం 'వేట్టయన్' భారీ అంచనాల మధ్య దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఈ సినిమా కథ గురించి రజనీ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. టి.జె.జ్ఞానవేల్ మొదట తీసుకువచ్చిన కథకు రజనీ మార్పులు సూచించారట. దానిలో కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయమని కోరారట. కుమార్తె సౌందర్య సిఫార్సు మేరకు రజనీకాంత్ 'వేట్టయన్' కథను విన్నట్లు చెప్పారు. 'టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో వచ్చిన 'జైభీమ్' సినిమా నాకెంతో నచ్చింది. కానీ, గతంలో జ్ఞానవేల్‌తో ఎప్పుడూ మాట్లాడే అవకాశం రాలేదు. 'వేట్టయన్' కథ వినమని సౌందర్య నాకు చెప్పడంతో విన్నాను. బాగుందనిపించింది. అయితే, ఈ సినిమా తీయడానికి చాలా డబ్బు ఖర్చవుతుంది. అందుకే కథలో కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయాలని కోరాను. 10 రోజుల సమయం అడిగాడు. 'కమర్షియల్ సినిమాగా మారుస్తాను. కానీ, నెల్సన్ దిలీప్‌కుమార్, లోకేశ్ కనగరాజ్‌ల సినిమాగా మార్చలేను. నా శైలిలో ప్రేక్షకులకు నచ్చేలా ఈ కథను మారుస్తాను' అని జ్ఞానవేల్ చెప్పాడు. 'నాకు అదే కావాలి.. లేదంటే లోకేశ్, దిలీప్‌ల దగ్గరకే వెళ్లేవాడిని కదా' అని చెప్పా. 10 రోజుల తర్వాత కథలో మార్పులు చేసి తీసుకొచ్చాడు. అది చూసి నేను ఆశ్చర్యపోయాను' అని రజనీకాంత్ తెలిపారు. ఈ సినిమాకు అనిరుధ్ మాత్రమే సంగీత దర్శకుడిగా ఉండాలని జ్ఞానవేల్ పట్టుపట్టినట్లు రజనీ గుర్తుచేసుకున్నారు. తమిళనాడులో గతంలో జరిగిన ఓ బూటకపు ఎన్‌కౌంటర్ నేపథ్యంతో దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఇది రజనీకాంత్‌కు 170వ చిత్రం. ఆయన ఇందులో రిటైర్డ్ పోలీసు అధికారిగా కనిపించనున్నట్టు సమాచారం. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా, రితికాసింగ్, మంజు వారియర్, దుషారా విజయన్ కీలకపాత్రలు పోషించారు. తెలుగులోనూ అదే పేరుతో విడుదల కానుంది.







# అసలు కథంతా పార్ట్-2లోనే ఉంది

## దేవర దర్శకుడు కొరటాల శివ వెల్లడి

కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన సినిమా 'దేవర'ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి మంచి విజయాన్ని అందుకొని ఎన్టీఆర్ అభిమానుల్లో జోష్ నింపింది. దీనికి కొనసాగింపుగా పార్ట్ 2 రానుందని దర్శకుడు గతంలోనే ప్రకటించారు. తాజాగా కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర 2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. దీంతో అభిమానుల అంచనాలు రెట్టింపయ్యాయి. పార్ట్ 2లో జాన్వీ పాత్ర అసాధారణంగా ఉంటుంది. ఆశ్చర్యపోతారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు సీట్ ఎడ్జికి వస్తారు. ఒక దర్శకుడిగా నేను పార్ట్ 2 విషయంలోనూ ఎంతో నమ్మకంగా, ఆసక్తిగా ఉన్నాను. కథలో అసలు మలుపు పార్ట్ 2లోనే ఉంది. ప్రతీ పాత్ర హైలో ఉంటుంది. ఎన్టీఆర్ అభిమానులందరికీ ఒక్కటే చెబుతున్నా.. పార్ట్1లో మీరు చూసింది 10 శాతమే.. రెండో భాగంలో 100శాతం చూస్తారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుంది. కొన్ని సన్నివేశాలు మీరు జీవితంలో మర్చిపోలేని అనుభూతిని అందిస్తాయి. ఈ విషయంలో ప్రామిస్ చేస్తున్నాను. తారక్ నటన గురించి చెప్పాల్సిన అవసరం లేదు. అతడు తన పాత్రకు జీవం పోస్తాడు' అని కొరటాల శివ 'దేవర 2' విషయంలో ధీమా వ్యక్తంచేశారు. ఇటీవల ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ కూడా 'దేవర 2' గురించి మాట్లాడిన సంగతి తెలిసిందే. మొదటిభాగం చిత్రీకరణ సమయంలోనే పార్ట్ 2లో కొన్ని సన్నివేశాలు షూట్ చేసినట్లు చెప్పారు. ఫస్ట్ పార్ట్ మంచి విజయం సాధించడంతో వారి బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర' కంటే దాని సీక్వెల్ ఇంకా బాగుంటుందని తెలిపారు. కథ సిద్ధంగా ఉందని.. మెరుగులు దిద్దాలన్నారు. కొరటాల శివ 'దేవర' కోసం ఎంతో కష్టపడినట్లు తెలిపారు. సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకువచ్చిన 'దేవర' ఇప్పటివరకు రూ.466 కోట్లు వసూలు చేసింది.త్వరలో రూ.500కోట్ల క్లబ్‌లోకి చేరడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.